ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

నస్పూర్, జనవరి 24 : ఈ నెల 25న 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో 'ఓటు లాంటిది ఇంకోటి లేదు– నేను కచ్చితంగా ఓటు వేస్తాను' అనే నినాదంతో ప్రతిజ్ఞ చేయించనున్నట్లు తెలిపారు. అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డులివ్వడం, సన్మానించనున్నట్లు తెలిపారు.

బెల్లంపల్లిలో ఓటరు దినోత్సవ ర్యాలీ

బెల్లంపల్లి, జనవరి 24: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం బెల్లంపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బిట్ల సుధాకర్ తెలిపారు. ఈ ర్యాలీ ఉదయం 10 గంటలకు తిలక్ స్టేడియం నుంచి బజార్ ఏరియా మీదుగా కాంటా చౌరస్తా వరకు కొనసాగుతుందని, యువతీ యువకులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

పాముకాటుతో చిన్నారి మృతి

వేమనపల్లి, జనవరి 24 : మండలంలోని లక్ష్మీపూర్‌కు చెందిన చిన్నారి హాసిని (4) పాముకాటుతో మంగళవారం సాయంత్రం మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బాలిక మూత్రవిసర్జన కోసం ఆరుబయటకు వెళ్లగా పాము కాటు వేసింది. దీంతో కుటుంబసభ్యులు వెంటనే గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ వచ్చే లోగా నాటు వైద్యుడి వద్దకు తీసుకువెళ్తుండగా బాలిక మృతి చెందింది.

తండ్రి మందలించాడని కుమార్తె ఆత్మహత్య


బైకం కీర్తన (ఫైల్)

హాజీపూర్, జనవరి 24 : మండలంలోని నర్సింగాపూర్‌కు చెందిన బైకం కీర్తన (19) మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చదువుకోకుండా ఎక్కువ సమయం సెల్‌ఫోన్‌లో గడుపుతుండడంతో కీర్తనను తండ్రి మందలించాడు. దీంతో క్షణావేశంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కీర్తన మేనమామ గెల్లు కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బావిలో దూకి యువకుడు..

రాజ్‌కుమార్ (ఫైల్)

తాండూర్, జనవరి 24 : మండల కేంద్రంలోని బోయవాడ వాల్మీకినగర్‌కు చెందిన అబ్బర్ల రాజ్‌కుమార్(22) బుధవారం సాయంత్రం ఇంటికి సమీపంలో బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తాండూర్ ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మృతుడి తల్లి దేవక్క నాలుగేళ్ల క్రితం మరణించింది. తండ్రి కూడా 9 నెలల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. రాజ్‌కుమార్ ఒంటరిగా ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది బుధవారం సాయంత్రం వాల్మీకినగర్‌లోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి నానమ్మ మల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తాండూర్ ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

బహిరంగ ప్రకటన

సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా అంది సాగర్ S/o. కీ||శే|| రవీందర్ R/o. ఓల్డ్ గర్మిల్లా, మంచిర్యాల టౌన్ & జిల్లా గారు బైరి రమేష్ S/o. శంకర్ R/o. అశోక్ రోడ్, మంచిర్యాల గారి నుండి మంచిర్యాల టౌన్‌లోని గర్మిల్లలో గల రాంనగర్ లొకాలిటీలో ప్లాట్ నెం. 5 సర్వేనెం. 729/అ, (729/3) లో 90 చ.గ.లు & సర్వేనెం. 729/1, (729/రు) లో 90 చ.గ.లు మొత్తం విస్తీర్ణం 180 చ.గ.లలో నిర్మితమైన గృహము నెం. 19-489/2-2 గల దానిని రిజిష్టర్డ్ విక్రయ దస్తావేజు నెం. 21694/2023 ద్వారా కొనుగోలు చేసినారు.ఇట్టి ప్రాపర్టీ పై అంది సాగర్ గారు లోను నిమిత్తము నాక్లయింటు ICICI బ్యాంక్ లి|| గోదావరిఖని బ్రాంచ్ గారిని సంప్రదించినారు. అదే సమయంలో ఇట్టి ప్రాపర్టీకి సంబంధించిన ఒరిజినల్ లింకు డాక్యుమెంటు రిజిష్టర్ సేల్‌డీడ్ నెం. 5501/2018 పోయినదని తెలిపినారు. కావున ఇట్టి డాక్యుమెంటు పై గాని లేదా పై ప్రాపర్టీ పై గాని ఎవరికైనా అభ్యంతరములు ఉన్న యెడల వ్రాత పూర్వక ఆధారాలతో (7) రోజులలో క్రింది చిరునామాలో గల వారికి తెలుపగలరు. లేని యెడల ఎలాంటి అభ్యంతరములు లేవని భావించి సదరు లోను మంజూరు విషయంలో ICICI బ్యాంక్ లి|| గోదావరిఖని బ్రాంచ్ గారు ప్రొసీడుకాగలరు.

ఇట్లు: సాన చంద్రమోహన్
అడ్వకేట్ (TS/138/1995) ప్లాట్ నెం.303, శ్రీసాయి ఎవెన్యూ ముకరంపుర, కరీంనగర్.
సెల్ :9666077777, 9141499999

బాలికలు చదువులో రాణించాలి

- అదనపు కలెక్టర్ రాహుల్
- జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాల్లో ఘనంగా బాలికా దినోత్సవం

మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్

నస్పూర్, జనవరి 24 : బాలికలు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా స్త్రీ, శిశు, వయోవృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య, డీఆర్డీవో శేషాద్రి, డీఈవో యాదయ్యతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 'బాలికలను రక్షిద్దాం..బాలికలను చదివిద్దాం' అనే కార్యక్రమంలో భాగంగా బాలికల సంరక్షణ, భ్రూణహత్యలు, బాల్య వివాహాల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. చదువులో బాలుర కంటే బాలికలు చక్కగా రాణిస్తున్నారని అభినందించారు. 'వాల్యూ ఆఫ్ గర్ల్‌చైల్డ్' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా విద్యార్థినులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బాలల పరిరక్షణ సమితి చైర్మన్ వాహిద్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ విద్యాలయంలో..

సీసీసీ నస్పూర్, జనవరి 24: నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థినులు 'బేటీ బచావో.. బేటీ పడావో, సేవ్ గర్ల్స్, సేవ్ చిల్డ్రన్స్' తదితర నినాదాలతో ముగ్గులు వేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి నస్పూర్ ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సమత హాజరై మాట్లాడారు. ఆడ పిల్లలు ఉన్నత చదువులు అభ్యసిస్తే చక్కటి భవిష్యత్ ఉంటుందన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలని ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ మౌనిక, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బాలికలకు వరం సుకన్యా సంవృద్ధి యోజన

చెన్నూర్, జనవరి 24: బాలికల ఆర్థిక భద్రతకు సుకన్య సంవృద్ధి యోజన పథకం ఎంతో ఉపయోగపడుతందని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (పాత బస్ స్టాండ్ బ్రాంచ్) మేనేజర్ కల్యాణపు రమేశ్ అన్నారు. చెన్నూర్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం పలువురు తల్లిదండ్రులు సుకన్యా సంవృద్ధి యోజన పొదుపు ఖాతాలను తీసుకున్నారు. వారిని అభినందించి, ప్రోత్సాహక బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు క్యాషియర్ రవీందర్, సిబ్బంది సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లిలో..

కోటపల్లి, జనవరి 24 : కోటపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాలిక విద్య, ప్రాముఖ్యత, కస్తూర్బా విద్యాలయాలతో ప్రయోజనాలను పాఠశాల స్పెషల్ ఆఫీసర్ హరిత వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. బావనపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినులకు తల్లిదండ్రులతో ఆశీర్వాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బొలిశెట్టి బుచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

నెన్నెలలో..

నెన్నెల, జనవరి 24: జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెన్నెల కస్తూర్బా పాఠశాలలో క్రీడా పోటీలు నిర్వహించారు. నెన్నెల హెడ్ కానిస్టేబుల్ అజయ్, ఎస్‌వో పెట్టం కవిత చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు.

వేమనపల్లిలో..

వేమనపల్లి, జనవరి 24 : వేమనపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం బాలిక దినోత్సవాన్ని ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మధుకర్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సువర్ణ, ఏఎన్ఎం రాజేశ్వరి, టీచర్ సంధ్యారాణి, హెల్త్ సీహెచ్‌వో రాజిరెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లి : కస్తూర్బా గాంధీ పాఠశాలలో వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు

వేమనపల్లి : అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటుతున్న ఉద్యోగులు

సింగరేణి

రిపబ్లిక్ డేను ఘనంగా నిర్వహించాలి

- మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఏ మనోహర్

మందమర్రిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీఎం మనోహర్

మందమర్రి, జనవరి 24: గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏరియాలోని అన్ని విభాగాల అధికారులు సహకరించాలని సింగరేణి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఏ మనోహర్ సూచించారు. 75వ గణతంత్ర వేడుకల నిర్వహణకు మందమర్రి పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో ఏర్పాట్లను బుధవారం ఆయన ఏరియా అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ కార్యక్రమాలను తిలకించేందుకు వచ్చే ఏరియాలోని ఉద్యోగులు, వారి కుటుంబాల ప్రజలతో పాటు వివిధ పాఠశాలల విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులను కల్పించాలని ఆయన అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యామ్‌సుందర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, డీవైపీఎం ఎండీ ఆసిఫ్, సివిల్ డీవైఎస్ఈ ఎం జయప్రకాశ్, డీవై మేనేజర్ ఫారెస్ట్ ఆర్. వెంకట రమణారెడ్డి, ఎస్ఈ(ఈ అండ్ ఎం) ఎం.నాగరాజు నాయక్, సివిల్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి పత్రాలు అందజేత

శ్రీరాంపూర్, జనవరి 24 : శ్రీరాంపూర్ ఓసీపీలో బుధవారం కార్మికులకు ఎస్ఎల్పీ ఉద్యోగోన్నతి లేఖలను ప్రాజెక్టు ఆఫీసర్ పురషోత్తంరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ కార్మికులు ఉద్యోగోన్నతి మరింత బాధ్యతగా పనిచేయాలని కోరారు. తోటి కార్మికుల అనుభవాలను పునికి పుచ్చుకొని పనిలో మెలకువలు నేర్చుకొని ఉత్పత్తి, ఉత్పాదకతకు కృషి చేయాలని కోరారు. రక్షణతో కూడిన ఉత్పత్తి తీయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్, ఈఈ శ్యామ్‌సుందర్‌రావు, సీనియర్ పీవో శంకర్, ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, పిట్ కార్యదర్శి నల్లపు సత్తయ్య పాల్గొన్నారు.

కార్మికుడికి టీబీజీకేఎస్ నాయకుల పరామర్శ

మందమర్రి, జనవరి 24: సింగరేణి మందమర్రి ఏరియాలోని కేకే–5గనిలో ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడి రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్న కార్మికుడు యాసీన్‌ను బుధవారం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) నాయకులు పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులను కోరారు. యాసీన్‌ను పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ మందమర్రి పట్టణ అధ్యక్షుడు జే.రవీందర్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి ఓ రాజశేఖర్ ఉన్నారు.

శ్రీరాంపూర్ ఏరియాలో పోస్టుల భర్తీకి పరీక్షలు

శ్రీరాంపూర్, జనవరి 24: శ్రీరాంపూర్ ఏరియాలోని గనులు, డిపార్ట్‌మెంటుల్లోని పలు పోస్టుల్లో ఖాళీల భర్తీకి సంస్థలో అనుభవం గల కార్మికులకు బుధవారం ఎంవీటీసీలో పరీక్షలు నిర్వహించారు. ఎస్వోటూజీఎం రఘుకుమార్, డీవైజీఎం అరవింద రావు, చిరంజీవులు ఆధ్వర్యంలో ఎంవీటీసీలో మున్షీ, హెడ్ చైన్ మన్, అసిస్టెంట్ చైన్‌మన్ డంప్‌మన్, ట్రిప్‌మన్‌ల భర్తీకి ప్రాక్టికల్ పరీక్షలు, రాత పరీక్షలు నిర్వహించి, ఫలితాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సర్వే ఆఫీసర్ వెంకటేశం, డీవైపీఎం రాజేశ్వర్ రావు, సీనియర్ అసిస్టెంట్ అరుంధతి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పిట్ కమిటీ

శ్రీరాంపూర్, జనవరి 24 : శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 5, 5బీ గ్రూప్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం బుధవారం గని ఆవరణలో నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీరాంపూర్ ఉపాధ్యక్షుడు డేగల ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి నక్క సుమన్ పాల్గొని పిట్ కమిటీని నియమించారు. ఆర్‌కే–5, 5బీ గ్రూప్ పిట్ కార్యదర్శిగా పృథ్వీ, సహాయ కార్యదర్శిగా శ్రావణ్, సలహాదారుగా దేవేందర్, సాయిలు జనరల్ షిఫ్ట్ ఇన్‌చార్జిగా అంజి, బీ రిలే ఇన్‌చార్జిగా శంకర్, ఏరియా ఇన్‌చార్జిగా సుజిత్‌ను నియమించినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆర్గనైజింగ్ కార్యదర్శి కే వాసు, సంయుక్త కార్యదర్శి శ్రీనాథ్, వెంకటేశ్, కోటేశ్వర్‌రావు, డేవిడ్, రవిబాబు పాల్గొన్నారు.

గురుకులాల భద్రత..తల్లిదండ్రుల బాధ్యత

- టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల ప్రభాకర్

నూతన జిల్లా కమిటీ సభ్యులతో రాష్ట్ర నాయకులు

మందమర్రి, జనవరి 24: తెలంగాణ గురుకులాల భద్రత తల్లిదండ్రుల బాధ్యత అని తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ అన్నారు. మందమర్రి పట్టణంలోని మంజునాథ గార్డెన్స్‌లో బుధవారం నిర్వహించిన టీజీపీఏ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గురుకుల పాఠశాలల్లో చదివే పిల్లలకు మెరుగైన విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, నూతన భవనాల నిర్మాణాల కోసం టీజీపీఏ కృషి చేస్తున్నదని తెలిపారు. టీజీపీఏ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల ఇన్‌చార్జి ఉప్పులేటి నరేశ్ అధ్యక్షతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గరిసె రవీందర్, ప్రధాన కార్యదర్శిగా బియ్యాల ఉపేందర్, ఉపాధ్యక్షులుగా కొండ సతీశ్, బొల్లం పవన్, కోశాధికారిగా సాగె పోచయ్య, సంయుక్త కార్యదర్శులుగా గడ్డి శంకర్, శాంకరీ జ్యోతి, దుర్గం లావణ్య, రామగిరి స్వామి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా అయిల్ల లక్ష్మణ్, సానగొండ సంపత్, మినుముల జనార్ధన్ ఎంపికయ్యారు. ఈ సమావేశంలో టీజీపీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దార మధు, రాష్ట్ర మహిళా కో కన్వీనర్ ఉప్పులేటి గోపిక, రాష్ట్ర సెక్యూరిటీ ఫోర్స్ కన్వీనర్ నందం, సభ్యులు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు పరిష్కరిస్తాం

- మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్

మంచిర్యాలటౌన్, జనవరి 24: మంచిర్యాలలోని పలు వార్డుల్లో నెలకొన్న తాగునీటి సరఫరాలో సమస్యలను పరిష్కరిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ తెలిపారు. రిజర్వాయర్లకు సంబంధించిన ఏరియాలు డివైడ్ చేస్తున్న కారణంగా24, 25, 26, 27 వార్డుల్లో నీరు తక్కువగా సరఫరా అవుతుందని, ఈ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. కాలేజ్‌రోడ్ ఏరియాలో నీటి సరఫరా పైప్‌లైన్‌లు మరమ్మతులు జరుగుతున్నందున 2,18, 21, 22, 32 వార్డుల్లో రోజు విడిచి రోజు నీటి సరఫరా ఉంటుందని తెలిపారు. మరమ్మతులు పూర్తికాగానే ప్రతి రోజూ నీటి సరఫరా ఉంటుందని కమిషనర్ పేర్కొన్నారు.

సమస్యలపై నిలదీత

మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్

దండేపల్లి, జనవరి24: దండేపల్లి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. పలు సమస్యలపై అధికారులను సభ్యులు నిలదీశారు. గొర్రెల పంపిణీకి సంబంధించి డీడీలు చెల్లించి నెలలు గడుస్తున్నా గొర్రెల పంపిణీ ఇంకెప్పుడు చేస్తారంటూ పశువైద్యాధికారి ధన్‌రాజ్‌పై సభ్యులు మండిపడ్డారు. కుక్క కాటుకు మందులు అందించడంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారని వైద్యాధికారులు సతీశ్, క్రాంతి కిరణ్‌ను సభ్యు లు నిలదీశారు. ఆశ కార్యకర్తలు కమీషన్ తీసుకొని ప్రసూతీ కేసులను ప్రైవేట్ దవాఖానకు తరలిస్తున్నారని ఎంపీటీసీ సభ్యుడు కొంగల నవీన్‌కుమార్ ఆరోపించారు. సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో సభ్యులు శాంతించారు. వ్యవసాయ, పశుసంవర్ధక, విద్యా, వైద్య, విద్యుత్, ప్రజా పంపిణి, ఐసీడీఎస్, నీటి పారుదల శాఖ అధికారులు తమ నివేదిక చదివి వినిపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జడ్పీటీసీ గడ్డం నాగరాణి, ఎంపీడీవో మల్లేశ్, ఏవో అంజిత్‌కుమార్, పీఆర్ఏఈ విక్రమ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శిరీష, ఈజీఎస్ ఏపీవో దుర్గాదాస్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

జన్నారం, జనవరి 24 :గ్రామాలను అభివృద్ధి చేయడం ప్రభుత్వ లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఇందన్‌పెల్లి రూ.13లక్షలు, కవ్వాల్ రూ 20 లక్షలు, జన్నారంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించి మాట్లాడారు. జన్నారం పంచాయతీలోని గొండుగూడకు వెళ్లే దారిలో వాగుపైన వంతెన నిర్మాణం, బీటీ రోడ్డు వేయడానికి, ఇతర పనులు చేయడానికి నిధులను మంజూరు చేయించి పనులు పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం పైడిపెల్లి ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామాల సర్పంచ్‌లు కంటెం సునీత, ఆర్ లక్ష్మీబాయి, బీ గంగాధర్‌గౌడ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ రియాజొద్దీన్ తుమ్రం సౌజన్య, నాయకులు ఏ సుభాష్‌రెడ్డి, ఎం రాజశేఖర్, మచ్చ శంకరయ్య, సుధాకర్‌నాయక్, ఫసీఉల్లా, రజాక్, బీనవేణి రాజన్న, హజార్, ఉపసర్పంచ్ జంగ రవి తదితరులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అంజనీపుత్ర సంస్థ సభ్యులు

మంచిర్యాల అర్బన్, జనవరి 24 : అంజనీపుత్ర సంస్థ ఆధ్వర్యంలో క్యాలెండర్, డైరీలను బుధవారం సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్, ఎండీ పిల్లి రవి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఉత్తర తెలంగాణ వ్యాప్తంగా అంజనీపుత్ర సంస్థ సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ఎస్ కిషన్, జీ సంతోష్, డైరెక్టర్లు, కస్టమర్లు, ప్రజలు తదితరులున్నారు.

కొమ్మెరలో రక్తదాన శిబిరం

రక్తదానం చేస్తున్న దాతలు

చెన్నూర్ రూరల్, జనవరి 24: చెన్నూర్ మండలంలోని కొమ్మెరలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సర్పంచ్ తాళ్లపెల్లి జయలక్ష్మి చిన్న కుమారుడు కీ.శే శ్రీనివాస్ గౌడ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం ఈ రక్తదాన శిబిరం కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. మంచిర్యాలలోని వలంటరీ రక్తనిధి కేంద్రం ఆధ్వర్యంలో సుమారుగా 60 మంది యువకులు పాల్గొని రక్తదానం చేసినట్లు బీఆర్ఎస్ నాయకులు తాళ్లపెల్లి కిరణ్ గౌడ్ తెలిపారు. యేటా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వడ్లకొండ రవి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం చేయూత

మందమర్రి, జనవరి 24: మందమర్రిలోని పాత బస్టాండ్ జయశంకర్ చౌరస్తాలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆంజనేయులు కుటుంబానికి భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ నాయకులు, సభ్యులు ఆర్థిక చేయూతనందించారు. తోటి భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యుడు ఆంజనేయులు కుటుంబ సహాయార్థం సంఘం ఆధ్వర్యంలో రూ.20 వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి ధర్మయ్య, చంద్రయ్య, లింగయ్య, మొగిలి తదితరులున్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం

దండేపల్లి, జనవరి 24 : దండేపల్లికి చెందిన పాలకుర్తి లక్ష్మణాచారి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో అతని కాలును తొలగించారు. అతని వైద్య ఖర్చుల నిమిత్తం దండేపల్లి విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రూ.15వేలు, మామిడిపల్లి విశ్వబ్రాహ్మణ సంఘం రూ.10 వేలు ఇంటి వద్ద బుధవారం తండ్రి బుచ్చన్నకు అందించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల గంగాధర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కట్ట వెంకటేశ్, జిల్లా సెక్రటరీ చొప్పదండి రమేశ్, సంఘం నాయకులు నూతి శ్రీకాంత్, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, శ్రీధర్, శ్రీహరి, సత్యనారాయణ, వెంకటేశ్, లక్ష్మణ్ ఉన్నారు.

కర్పూరీ ఠాకూర్ జయంతి

మంచిర్యాల అర్బన్, జనవరి 24 : మంచిర్యాల ఐబీ చౌరస్తాలో తెలంగాణ బీసీ జాగృతి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం బీసీ రిజర్వేషన్ల ప్రదాత, బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్ శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనకు ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కంది శ్రీనివాస్, బీసీ నాయకులు భాస్కర్, సత్యనారాయణ, సదానందం, మల్లేశ్, లక్ష్మణ్, రాజు, విజయ్ కుమార్, సూరన్న, మోహన్, పద్మాదేవి, శ్రీనివాస్, వెంకటేశం, భీమయ్య, వెంకన్న, కనకయ్య, శ్రీనివాస్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖలో అవినీతి ఆరోపణలపై విచారణ

చెన్నూర్ రూరల్, జనవరి 24: వ్యవసాయ శాఖలో అవినీతి జరిగిందని వచ్చిన ఆరోపణలపై సీఎంవో నుంచి ఆదేశాలు రావడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో విచారణ చేపడుతున్నట్లు జడ్పీ సీఈవో నరేందర్ తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో విచారణ చేపట్టారు. మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో స్టాక్ ఇండెంట్, అలాట్‌మెంట్, రికార్డుల వివరాలను పరిశీలించారు. పలువురు అధికారులను వ్యక్తిగతంగా విచారించినట్లు పేర్కొన్నారు. పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట జడ్పీ సీఈవో సూపరింటెండెంట్ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్, చెన్నూర్ ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెన్నూర్ ఇన్‌చార్జి ఏవోగా మహేందర్

మంచిర్యాల అర్బన్/చెన్నూర్ రూరల్ జనవరి 24 : చెన్నూర్ వ్యవసాయ శాఖ అధికారి అవినీతి ఆరోపణలు ఎదుర్కోగా ఆమెను ఆ బాధ్యతల నుంచి తొలగిస్తూ ఉన్నతాధికారులు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. చెన్నూర్, మందమర్రి మండలాలకు ఏవోగా పని చేస్తున్న కవితపై వసూళ్లకు సంబంధించిన ఆరోపణలు రాగా వెంటనే తన ఓడీ క్యాన్సిల్ చేసి డీఏవో కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఆమె స్థానంలో కోటపల్లి ఏవో మహేందర్‌కు ఇన్‌చార్జి ఏవోగా బాధ్యతలు అప్పగించారు.

డిప్యూటీ సీఎంకు వినతి

జన్నారం, జనవరి 24 :హైకోర్టులో కొత్తగా నియమించే జీపీ, ఏజీపీ నియామకాల్లో న్యాయం చేయాలని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కను హైకోర్టు మాజీ ఏజీపీ, న్యాయవాది రత్నం రాజేశ్‌నేత వినతిపత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం భర్తీ చేయనున్న కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో నేతకాని కులస్తులకు అవకాశం కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

సమావేశం నిర్వహించాలి

బెల్లంపల్లి, జనవరి 24: మున్సిపల్ సాధారణ సమావేశం వెంటనే నిర్వహించాలని కౌన్సిలర్లు కోరారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ భుజంగరావుకు వినతిపత్రం సమర్పించారు. కౌన్సిల్ తీర్మానాలు లేకపోవడంతో పారిశుధ్య, నర్సరీ, మిషన్ భగీరథ, ఎల్ఈడీ లైటింగ్, బోర్ వెల్ విభాగంలో పనులు నిలిచిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో కౌన్సిలర్లు బొడ్డు నారాయణ, గోసిక రమేశ్, గడ్డం అశోక్‌గౌడ్, కొక్కెర చంద్రశేఖర్, నెల్లి శ్రీలత, పోలు ఉమాదేవి, పోతరాజుల లింగమూర్తి, ఎస్‌కే ఆస్మా తదితరులున్నారు.

హెల్మెట్‌తో సురక్షిత ప్రయాణం

- సీసీసీనస్పూర్ ఎస్ఐ రవికుమార్

వాహనదారుడికి పువ్వు అందజేస్తున్న విద్యార్థిని

సీసీసీ నస్పూర్, జనవరి 24: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీసీసీ నస్పూర్ ఎస్ఐ రవికుమార్ అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యూ విజన్ స్కూల్ ఆధ్వర్యంలో బుధవారం రోడ్డు భద్రతపై ప్లకార్డులను ప్రదర్శిస్తూ అవగాహన ర్యాలీ తీశారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారికి చిన్నారులు పూలు అందజేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఐలయ్య, ప్రిన్సిపాల్ కరిష్మా, ఉపాధ్యాయులు హారిక, సంధ్య, లావణ్య, సాయిప్రసన్న, శివకుమారి, ప్రియాంక, అనూష, ఉదయకీర్తన, రమ, రుబీనా, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలి

- డీఎల్పీవో ఫణిందర్‌రావు

తాండూర్, జనవరి 24 : మండలంలోని అన్ని గ్రామపంచాయతీల పరిధిలో ప్రతి రోజూ పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని డీఎల్పీవో ఫణింధర్‌రావు గ్రామపంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం రేచిని గ్రామపంచాయతీని మొబైల్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా తనిఖీ చేశారు. పారిశుధ్య పనులు, పన్నుల వసూలు, నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై కార్యదర్శి శ్రీనివాస్‌కు సూచనలు చేశారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పనులు, నర్సరీల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఎంపీవో సత్యనారాయణ, ఏపీవో నందకుమార్, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాల అర్బన్, జనవరి 24 : మంచిర్యాల అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో నైట్ వాచ్‌మెన్ పోస్టు భర్తీకి పదవ తరగతి చదివిన పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈవో యాదయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ నుంచి 30వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు ఐడీవోసీలోని రూమ్ నంబర్ ఎస్–17లో గల జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సెక్యూరిటీ ఏజెన్సీ ద్వారా ట్రైనింగ్ సర్టిఫికెట్ ఉంటే ప్రాధాన్యం ఉంటుందన్నారు.

మృతదేహంతో యువతి ఇంటి ముందు ఆందోళన

మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

మంచిర్యాల ఏసీసీ, జనవరి 24 : ప్రేమ విఫలమై ఆత్మహత్య చేసుకున్న యువకుడి మృతదేహంతో.. యువతి ఇంటి ముందు ఆందోళనకు దిగిన ఘటన మంచిర్యాల జిల్లాలో బుధవారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మంచిర్యాల పట్టణంలోని అశోక్ రోడ్‌కు చెందిన సల్మాన్.. అదే కాలనీకి చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. కొన్ని రోజులుగా అతడి ప్రియురాలు వేరే వ్యక్తితో చనువుగా ఉంటుండడంతో తట్టుకోలేక సోమవారం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు స్థానిక దవాఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మరణించాడు. సల్మాన్ చావుకు కారణ మైందంటూ మృతదేహంతో ఆ యువతి ఇంటికి చేరుకొని నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శాంతింపజేశారు. ఫిర్యాదు ఇస్తే విచారణ చేపట్టి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.